సాక్షి నంద్యాల

గురువారం, 7, సెప్టెంబర్, 2023



జ్వాలావీరభద్రస్వామికి పూజలు
శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



ఎంసీఏకు యమ క్రేజీ
ఇంజినీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్‌కు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఎంసీఏ కోర్సుకు ప్రాధాన్యత ఏర్పడింది. దీంతో ఈ ఏడాది సీట్ల సంఖ్యను పెంచారు. 8లో▸



నాణ్యతా పరీక్ష అ'ధర'హో!
మార్కెట్ యార్డుల్లో పంట నాణ్యతా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులకు మంచి ధర లభిస్తోంది. రెండేళ్లుగా వేరుశనగకు మద్దతుకు మించి ధర దక్కుతోంది. 8లో▸

న్యూస్‌రీల్

సుంకేసుల నుంచి కేసీకి నీటి విడుదల



కేసీ కాల్వలో నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: ఆయకట్టు రైతుల కోసం సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వారం క్రితం కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోవటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో వారు నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారు. కాగా నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని ఏఈ శ్రీనివాసనాయక్ సూచించారు. దిగువకు వచ్చిన నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీశైలానికి మళ్లీ మొదలైన వరద



శ్రీశైలం జలాశయం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలోకి ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం మళ్లీ మొదలైంది. ఒక్కరోజులోనే సుమారు రెండున్నర టీఎంసీల నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. సుంకేసుల, హంద్రీ, జూరాల నుంచి బుధవారం సాయంత్రానికి 40,107 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయంలోకి 5,237 క్యూసెక్కుల నీరు విడుదలైంది. హంద్రీనీవా సుజల స్రవంతికి 1,315 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,500, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 3,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 14.80 మి.మీ వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 82.7663 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటి మట్టం 851.20 అడుగులకు చేరుకుంది.

ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని బస్సు సర్వీసులు

డోన్ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం పలు రూట్లలో బస్సు సర్వీసులు పెంచనున్నట్లు నంద్యాల జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన డోన్- పత్తికొండ బస్సు సర్వీసు ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఆర్టీసీ అధిక ఆదాయం ఆర్జిస్తున్నట్లు తెలిపారు. ఓఆర్ రేటు 81 శాతానికి పెరిగిందన్నారు. ఆగస్టు నెలలో ఓఆర్ 68 శాతంతో 19.36 కోట్లు ఆదాయం ఆర్జించినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఇప్పటికే 86 శాతం ఓఆర్ ఉన్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల 5 రూట్లలో నూతన బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. డోన్ నుంచి పత్తికొండ, డోన్ - గుడిపాడు, పత్తికొండ నుంచి నంద్యాల వయా ప్యాపిలి, బనగానపల్లె, బేతంచర్ల నుంచి వెల్దుర్తికి , నంద్యాల నుంచి బేతంచెర్లకు సాయంత్రం 6గంటల తర్వాత బస్సు సౌకర్యం, ప్రతి శుక్ర, శనివారాల్లో మద్దిలేటి స్వామి క్షేత్రానికి బస్సు సర్వీసులు కొత్తగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా చేస్తోంది. ఆరుగాలం కష్టించే రైతుకు విత్తనం మొదలు పంట విక్రయం వరకు ప్రతి అంశంలో తోడుగా నిలబడుతోంది. తాజాగా పంటల సాగుకు కీలకమైన సాగునీటి వనరుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఉపాధి నిధులతో చెరువులు, ఊర కుంటలు, వాగులు, చెక్‌డ్యాంలతో పాటు పంట కాల్వల్లో పూడికతీత పనులు చేపడుతోంది. ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యంగా జిల్లాలో ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

చెరువు నిండేలా.. చేను పండేలా!

ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె ఎర్ర చెరువులో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం



- ఉపాధి నిధులతో పంట కాలువల అభివృద్ధి
- చెరువులు, ఊర కుంటలు, చెక్‌డ్యాంలలో సమృద్ధిగా నీరు నింపడమే లక్ష్యంగా పూడికతీత
- చివరి ఆయకట్టుకు సైతం అందనున్న సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



బాచ్చాపురం నల్లాగు చెక్‌డ్యాంలో ముళ్లకంపలు తొలగిస్తున్న కూలీలు

ఆళ్లగడ్డ: జిల్లాలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఇలా సాగుకు ప్రధానమైన జలవనరులు దశాబ్దాలుగా మరమ్మతులు లేకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయకట్టు కాలువలు రూపమే మారిపోయింది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. చివరి ఆయకట్టు వరకు సాగునీరు సమృద్ధిగా అందించడమే లక్ష్యంగా సాగునీటి పథకాల అభివృద్ధిని ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేసింది. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలో నీటి సామర్థ్యాన్ని పెంచి తద్వార బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కాలువల్లో ముళ్లకంపలు తొలగించడంతో పాటు పూడికతీత పనులు చేస్తున్నారు. దీంతో ఉనికి కోల్పోయిన జలవనరులు, కాలువలు గ్రామాల్లో కొత్త రూపు సంతరించుకుంటున్నాయి.

సాగు పథం.. 'ఉపాధి'కి ఊతం

జిల్లాలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 109, వంద ఎకరాలకు లోపు ఆయకట్టు ఉన్న చెరువులు 74, చెక్‌డ్యాంలు 1542, కుంటలు 74 ఉండగా వీటికింద అధికారికంగా 1,21,565 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇవికాక తెలుగు గంగ, కేసీకెనాల్, ఎస్‌ఆర్‌బీసీ తదితర వాటి కింద సుమారు 2.5 లక్షల హెక్టార్లు ఆయకట్టు ఉంది. ఆయకట్టు చివరి వరకు నీరు పారాలంటే పంట కాల్వల్లో ఈ పది సంవత్సరాల మధ్య కాలంలో ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో కాల్వలన్నీ ముళ్లకంపలు, పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. ఉపాధి హామీ కింద వాటి తొలగింపునతో పాటు కాలువల ఆధునికీకరణకు ప్రాధాన్యం కల్పించి నిధులు కేటాయించింది. ఇప్పటి వరకు జిల్లాలోని 29 మండలాల పరిధిలోని 489 గ్రామ పంచాయతీల పరిధిలో 57.28 లక్షల పనిదినాలు కల్పించింది. దీంతో ఉపాధి కూలీలకు రూ 142.500 కోట్లు ఖర్చు ఖర్చు చేసింది.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఉపాధి పథకంలో మరమ్మతులు చేసిన పంట కాల్వలు, ఖర్చు చేసిన నిధులు

నియోజకవర్గం	మరమ్మతులు చేసిన కాల్వలు	ఖర్చు చేసిన నిధులు
బనగానపల్లె	176	రూ. 748.813 లక్షలు
డోన్	375	రూ. 143.46 లక్షలు
నందికొట్కూరు	1,648	రూ. 1551.127 లక్షలు
పాణ్యం	1,258	రూ. 652.016 లక్షలు
నంద్యాల	1,603	రూ. 653.761 లక్షలు
శ్రీశైలం	1,973	రూ. 1411.426 లక్షలు
ఆళ్లగడ్డ	3,543	రూ. 1760.671 లక్షలు
మొత్తం	10,576	రూ. 6921.274 లక్షలు

ఈ ఏడాది ఉపాధి పథకం కింద జిల్లాలో చేపట్టిన జలవనరుల అభివృద్ధి పనుల వివరాలు

పంటకాల్వలు	10,576
చెరువులు	183
చెక్‌డ్యాంలు	1542
కుంటలు	74
ఇంతవరకు చేసిన పనిదినాలు	57.28 లక్షలు
కూలీలకు ఖర్చు	142.500 కోట్లు
మెటీరియల్ కాస్ట్	12.452 కోట్లు
పనులు చేపట్టిన గ్రామ పంచాయతీలు	489

చేపడుతున్న పనులు ఇవి..

- భారీ, మధ్యతరహా, చిన్న నీటి పారుదల శాఖ పరిధిలోని ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ, సబ్, పంట పొలాలకు వెళ్లే పిల్ల కాలువలు, వీటి నుంచి చెరువులు నింపే కాలువల్లో పూడిక, పిచ్చిమొక్కలను తొలగింపు
- చెరువుల నుంచి పంట పొలాలకు ఉన్న కాలువ మరమ్మతులు చేపట్టడం, కాలువలు లేకుంటే మట్టి కాల్వలు నిర్మించడం
- చెరువుల కింద ఉన్న కాలువలు, ఫీడర్ చానల్‌లను అభివృద్ధి చేయడం
- అవసరమున్న చోట కొత్తగా మట్టి కట్టలు, కాలువల నిర్మాణం
- ఊర కుంటలు, వాగులు, వంకలు, వేటవాలు పొలాల్లో చెక్‌డ్యాంలలో పూడిక తీయడం

70 శాతం పనులు పూర్తి



ఉపాధి హామీ పథకం పనులన్నీ దాదాపు పంట కాల్వలు, సాగు, తాగు నీటి వనరులను అభివృద్ధి చేసేందుకే చేపడుతున్నాం. దీంతో గ్రామాల్లో కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు చివరి ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ ఏడాది గుర్తించిన పనుల్లో దాదాపు 70 శాతం పనులను పూర్తి చేయడం జరిగింది. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. - రామచంద్రారెడ్డి, ఏపీడీ, డ్వామా

పంట కాల్వలకు మహర్దశ



పంట కాల్వలు శుభ్రంగా లేక పోవడంతో సాగునీరు చాలా వృథా అయ్యేది. గత సంవత్సరం నుంచి ప్రభుత్వం ఉపాధి పనులతో పంట కాల్వల్లో పూడిక తీయడం, ముళ్ల కంపలు తొలగించడంతో పాటు గట్లు సక్రమంగా సరిచేసే పనులను చేపట్టడంతో చివరి ఆయకట్టుకు కూడా నీరు చేరుతుంది. కాలువల అభివృద్ధితో రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకోవచ్చు.
- రఘురామిరెడ్డి, ఈఈ, జిల్లా జలవనరుల శాఖ

చాలా ఉపయోగం



మా గ్రామ చెరువులో పూడికతీత పనులు చేపట్టాం. ఇప్పటికే కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేశాం. దీంతో తెలుగుగంగ నీరుతో పాటు కొండపై నుంచి వచ్చే నీరంతా నేరుగా చెరువులోకి వచ్చి చేరుతుంది. చెరువు కింద ఉన్న సుమారు 500 ఎకరాలకు సాగునీటికి డోకా ఉండదు. అలాగే చెరువులో చేపలు వదులుకునే అవకాశం లభించింది. చెరువులు, కాల్వల్లో పూడికతీత వల్ల మాలాంటి రైతులకు చాలా ఉపయోగం.
- మోహన్‌రెడ్డి, రైతు, లింగందిన్నె



కృష్ణం వందే జగద్గురుం

చిన్నారులు.. చిన్ని కృష్ణులయ్యారు.. నెమలి పింఛం ధరించారు.. వెన్న ముద్ద తిన్నారు.. ఉట్టి కొట్టారు. వేణువు ఊదుతూ సందడి చేశారు. గోపికల వేషధారణలో ఉన్న బాలికలతో ఆడిపాడి అలరించారు. కృష్ణాష్టమి సందర్భంగా జిల్లాలో 'కృష్ణం వందే జగద్గురుం' ప్రదర్శనలు నిర్వహించారు. కర్నూలులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రదర్శన ఇస్తున్న చిన్నారుల దృశ్యమిది.
- సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు

రేపటి నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక కింద కొత్తగా మంజూరైన పింఛన్లను ఈ నెల 8వ తేదీ నుంచి పంపిణీ చేసేందుకు డీఆర్‌డీఏ-వైకేపీ ఏర్పాట్లు చేసింది. ఆగస్టు నెల చివరిలో ఉమ్మడి జిల్లాకు 11,085 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. పాత వాటితో పాటు వీటి పంపిణీ 99 శాతం పైగా పూర్తయింది. తాజాగా మంజూరైన 12,218 కొత్త పింఛన్లను ఈ నెల 10వ తేదీ వరకు పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం గురువారం విడుదల చేసే అవకాశం ఉంది.

శ్రీశైలంలో వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం(ఈ నెల 8 వ తేది) నిర్వహించే వరలక్ష్మీవ్రతానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శ్రీశైలంలోని చంద్రవతి కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ వ్రతంలో 500 మంది చెంచు ముత్తైదువలు, 500 మంది దాకా ఇతర భక్తులకు అవకాశం కల్పించనుంది. చెంచుముత్తైదువల ఎంపికకు ఆలయాధికారులు స్థానిక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ వారి సహాయ సహకారాలు తీసుకుంటున్నారు. వ్రతంలో పాల్గొనదలచిన ముత్తైదువలు గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు దేవస్థాన కార్యాలయంలోని ప్రచురణల విభాగంలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. తర్వాత వారికి అమ్మవారి శేషవస్త్రాలు, జాకెట్ పీస్, పూలు, గాజులు, ప్రసాదం అందిస్తారు. వ్రతాచరణకు వీలుగా శ్రీస్వామిఅమ్మవార్ల కైలాస కంకణాన్ని ధరింపజేస్తారు. వ్రతం అనంతరం శ్రీశైలప్రభ సంచికను అందిస్తారు. పూజా సామగ్రి మొత్తం దేవస్థానమే సమకూరుస్తుంది. వ్రతానంతరం ముత్తైదువులందరికి భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనం, భోజన సదుపాయం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే కాన్పులకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశం

నంద్యాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలలో కాన్పులు కష్టమై సిజేరియన్ చేసే పరిస్థితులు ఏర్పడితే సమీప సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. పేదలు కాన్పు కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బు వృథా చేసుకోకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని వారికి తెలియజేయాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం విషయంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య నిమిత్తం నిర్దేశించిన నెలవారీ లక్ష్యాలను కచ్చితంగా సాధించాలన్నారు. బనగానపల్లె వంద పడకల ఆసుపత్రి స్థాయికి చేరుకున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాలైన ఉప్పలపాడు, అవుకు, టంగుటూరు, పలుకూరు తదితర పీహెచ్‌సీలను అనుసంధానం చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే డోన్‌లోని వంద పడకల ఆసుపత్రికి కూడా చుట్టుపక్కల గ్రామాలను అనుసంధానం చేసి వైద్య సేవలు అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల 'ఉన్నతి'కి భరోసా

- ఉపాధికూలీల పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం ఊతం
- సీడాప్ ద్వారా ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ
- 100 శాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా తర్ఫీదు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 250 మందికి శిక్షణ
- 150 మందికి ఉద్యోగ కల్పన

నంద్యాల(సెంట్రల్): కూలీల పిల్లలు కూలీలుగానే మిగిలిపోకూడదు. అర్హత, ఆసక్తి ఉన్న వారికి ప్రోత్సహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టాలి. ఈ ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఉన్నతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవించే వారి కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీయువకులకు సీడాప్ ద్వారా ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఇందుకు ఒక్కో అభ్యర్థిపై సర్కారు రూ.44,850 ఖర్చు చేస్తోంది.

పల్లెల్లో పేదలకు పని కల్పించి వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన పిల్లలకు 'ఉన్నతి' కార్యక్రమాన్ని సీడాప్ అమలు చేస్తోంది. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. 2018 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల వరకు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలను డ్వామా సహకారంతో సీడాప్ అధికారులు గుర్తిస్తున్నారు.

250 మందిలో 150 మందికి ఉద్యోగాలు

2019-20 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధి శాఖ, డ్వామా సంయుక్తంగా 'ఉన్నతి' కార్యక్రమాన్ని అమలు చేశాయి. కరోనా కారణంగా మొదటి ఏడాదిలో ఒక బ్యాచ్‌కు శిక్షణ అందించాయి. అనంతరం రెండేళ్లపాటు శిక్షణ నిలిపివేసినప్పటికీ...గత ఆర్థిక సంవత్సరంలో పునఃప్రారంభమైంది. ఇప్పటి వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 250 మందికి శిక్షణ అందించగా...వారిలో 150 మందికి ఉద్యోగాలు వచ్చాయి.



శిక్షణ ఇస్తూ కూలి డబ్బులు సైతం జమ

ఉపాధి కూలీల పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు కదా...అని కూలీల వేతనాలకు ఏమాత్రం కోత పెట్టరు. పైపెచ్చు శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థికి 90 రోజుల పాటు రోజుకు రూ.273 వంతున ఖాతాలో జమచేస్తారు. దీనికోసం శిక్షణార్థులు 80 శాతం హాజరు తప్పనిసరిగా కొనసాగించాలి.

సీడాప్‌కు ధన్యవాదాలు



నేను 2020లో డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం రావాలంటే సంబంధిత కోర్సుల్లో నైపుణ్యం తప్పనిసరి. ఇందుకోసం నేను హైదరాబాద్ వెళ్లి శిక్షణ తీసుకోలేక ఇంటి వద్దే ఉండిపోయాను. 2022లో సీడాప్ గురించి తెలుసుకుని అందులో చేరాను. మూడు నెలల శిక్షణలో గ్రూమింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, వెబ్ డెవలపింగ్ గురించి పూర్తిగా నేర్పించారు. అనంతరం నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎస్‌బీఆర్ టెక్నాలజీస్‌లో క్యూసీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాను. రూ.13,700 జీతం ఇస్తున్నారు. అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీడాప్‌కు ధన్యవాదాలు. - పి.అంకరాజు, సంతజూటూరు, బండిఆత్మకూరు, నంద్యాల జిల్లా

మూడు నెలల శిక్షణ

పదో తరగతి చదివిన వారికి రిటైల్ రంగంలో, ఇంటర్ పూర్తి చేసినవారికి బ్రాడ్‌బాండ్ కనెక్షన్, డిగ్రీ పట్టభద్రులకు వెబ్ డెవలపర్ పైతాన్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ కాలంలో భోజనం, ఏకరూప దుస్తులు, వసతి పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. కర్నూలు సీతారామనగర్‌లోని లా మెక్లిన్ అనే ప్రైవేటు సంస్థతో పాటు, బి.తాండ్రపాడులోని డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు. లా మెక్లిన్‌లో ప్రస్తుతం 35 మంది బ్యాచ్‌కు శిక్షణ నడుస్తుండగా, డీఆర్‌డీఏ వద్ద 15 మంది దాకా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటున్నారు.

ఆర్థిక సాధికారత లభించింది



మాది ఆర్థికంగా చాలా వెనుకబడిన కుటుంబం. కష్టపడి 2019లో డిగ్రీ పూర్తిచేశాను. శిక్షణ కోసం హైదరాబాద్ వెళ్తామంటే తల్లిదండ్రులు వివిధ కారణాలతో పంపించలేదు. తర్వాత నాకు 2022లో సీడాప్ గురించి తెలిసింది. మూడు నెలలు శిక్షణ తీసుకున్నాను. ఖర్చంతా ప్రభుత్వమే భరించింది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లోని నార్తర్న్ ఐటీ సర్వీసెస్‌లో టెలీ కాలర్‌గా పనిచేస్తున్నాను. రూ.12,000 వేతనం లభిస్తోంది. మా బంధువులు, తెలిసిన వాళ్లు నన్ను మెచ్చుకుంటుంటే గర్వంగా ఉంది. సీడాప్‌లో శిక్షణ తీసుకుంటే ఉద్యోగం కచ్చితం. మాలాంటి పేదల పిల్లల ఉన్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ అభినందనీయం.
- జి.వెంకటేశ్వరమ్మ, చనుగొండ్ల, కర్నూలు జిల్లా

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

అర్హత ఉన్న కుటుంబంలో నిరుద్యోగులుంటే దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ తీసుకుని ఉపాధి పొందవచ్చు. ప్రస్తుతం 50 మంది దాకా శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, సేల్స్ సూపర్‌వైజర్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.
- రామచంద్రారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ

23న ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం

కర్నూలు సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం) 5వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్నాతకోత్సవంలో 2019-23 బ్యాచ్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు.

టీబీ డ్యాంలో 72 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్దనున్న తుంగభద్ర జలాశయంలో బుధవారం డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా 1,623.84 అడుగులకు చేరుకుంది. 105.788 టీఎంసీలకు గాను 72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 1,191 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో 6,469 క్యూసెక్కులు ఉంది. కర్నూలు జిల్లాకు సంబంధించి తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) ఆంధ్రలో ప్రారంభమయ్యే 250 కిలోమీటరు వద్ద 670 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ANANTHA COLLEGE
STUDY CENTER CODE 369, NANDYAL
DISTANCE EDUCATION
ACHARYA NAGARJUNA UNIVERSITY
COURSE OFFERED:
BA (ALL), B.COM (COMPUTER),BBA, MA (ALL), M.COM, MSW, MA (JOURNLISM), MLISC, BLISC
ITI, ELECTRICIAN & B.ED SEATS AVAILABLE
CONTACT: 99893 25944

క్లుప్తంగా

కర్నూలులో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు



రాష్ట్రస్థాయి పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని యోగా హాలులో ఈనెల 9, 10 తేదీల్లో 48 వ రాష్ట్ర స్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్రస్థాయి యోగా పోటీల లోగోను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 450 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా క్రీడా శాఖ సీఈఓ రమణ, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, రైస్ మిల్లు యజమాని భాస్కర్ రెడ్డి, జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన రాజశేఖర్

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె పరిధిలోని లొక్కిగుండం రామేశ్వర స్వామి ఆలయ సమీపంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. కృష్ణాష్టమి పండుగ రోజు ఈ ఘటన జరగడంతో గొర్విమానుపల్లెలో విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెళితే.. లొక్కిగుండంలోని ఆలయం వద్ద ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ట్రాక్టర్లలో మట్టిని తీసుకెళ్లే సమయంలో ట్రాన్స్‌ఫారం నుంచి గుడి వరకు ఉన్న విద్యుత్ తీగ కిందకు వేలాడుతోంది. ట్రాక్టర్‌కు తగులుతుందేమోనని గొర్విమానుపల్లెకు చెందిన రాజశేఖర్ (27) ఇనుప పైపుతో విద్యుత్ వైరును పక్కకు జరిపి ట్రాక్టర్ ట్రాలీపైకి ఎక్కి సరి చేస్తున్నాడు. ఆ సమయంలో చేతిలో ఉన్న ఇనుప పైపు మెయిన్ కరెంట్ తీగకు తాకడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ యువకుడిని రక్షించే ప్రయత్నం చేసిన కమ్మరి కిట్టయ్య అనే వ్యక్తి స్వల్ప గాయాలకు గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



కౌతాళం మండలం కామవరంలో ఊరేగింపు



కర్నూలులో కృష్ణాష్టమి వేడుకలకు హాజరైన ప్రజలు



కర్నూలులో ప్రత్యేక అలంకారంలో కన్నయ్య

జయ జనార్దనా.. రాధికాపతే!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. మండపాల్లో గోవర్ధనుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతను పూజించి ఉట్లోత్సవం నిర్వహించారు. కన్నయ్య, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. జనార్దనుడిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామాలు, పట్టణాల్లో ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. –సాక్షినెట్‌వర్క్



జూపాడుబంగ్లా మండలంలో ఉట్టిని కొడుతున్న యువకులు



మద్దికెర మండలం పెరవలిలో భగవద్గీత చదువుతున్న పెద్దలు



శిరివెళ్ల మండలం గీతాశ్రీమంలో గోపికల వేషధారణలో నృత్యాలు

నిద్ర లేవు.. నాన్నా!

- తండ్రి మృతదేహంపై పడి కుమార్తె రోదన
- ఆదోనిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్



కుమార్తె అనూషశ్రీతో కానిస్టేబుల్ సందీప్ కుమార్ (ఫైల్)

ఆదోని అర్బన్: ''నాన్నా నిద్రలేవు.. నన్ను చూడు'' అంటూ కుమార్తె అనుషశ్రీ తండ్రి మృతదేహంపై రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఆదోని డీఎస్పీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ సందీప్‌కుమార్(32) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మృతదేహాన్ని చూసి తట్టుకోలేక కుమార్తె గుండెలవిసేలా రోదించింది. ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామానికి చెందిన నారాయణస్వామి పెద్దకుమారుడు సందీప్ కుమార్ 2011లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఈయనకు భార్య హేమలత, కుమార్తె అనూషశ్రీ ఉన్నారు. ఆదోని పట్టణంలోని కపటినగర్‌లో వీరు నివాసముంటున్నారు. కుమార్తె పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. బుధవారం ఉదయం ఇంట్లో బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు జంక్షన్ వైరుతో ఉరి వేసుకొని సందీప్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం హాలులో పడుకున్న తల్లి, కుమార్తె రూములోకి వెళ్లి చూడగానే ఫ్యాన్‌కు సందీప్‌కుమార్ వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్, ఎస్ఐ చంద్ర, సిబ్బంది లక్ష్మణ్, విష్ణు తదితరులు వెంటనే సందీప్ కుమార్ ఇంటికి చేరుకున్నారు. ఫ్యాన్‌కు వేలాడుతున్న కానిస్టేబుల్ మృతదేహాన్ని కిందకు దింపి, అనంతరం అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సమయంలో మృతుడి కుమార్తె అనుషశ్రీ రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. సందీప్‌కుమార్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని స్వగ్రామమైన గుమ్మనూరుకు అంబులెన్స్‌లో తరలించారు.



మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి, కుమార్తె

హిందువుల ఐక్యతతోనే భవ్య రామ మందిరం

- వీహెచ్‌పీ కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే



మాట్లాడుతున్న మిలింద్ పరాండే

కర్నూలు కల్చరల్: హిందూ సమాజం సంఘటితమైందని, దాని పర్యావసానమే అయోధ్యలో భవ్య రామ మందిరం నిర్మాణం అని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కేంద్రీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. గురువారం నంద్యాల చెక్‌పోస్టులోని దేవీ ఫంక్షన్ హాల్‌లో విశ్వ హిందూ పరిషత్ షష్ట్యబ్ది ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుధవారం నుంచి వచ్చే సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి వరకు సంవత్సరం పాటు వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించ బోతున్నామన్నారు. శ్రీకృష్ణ జన్మస్థానంలో శ్రీకృష్ణ మందిరం లేకపోవడం హిందువులంతా చింతించాల్సిన విషయం అన్నారు. రాబోయే రోజుల్లో శ్రీకృష్ణ జన్మస్థానం మధురలో భవ్య శ్రీకృష్ణ ఆలయం, కాశీలో భవ్య పరమేశ్వర మందిరం నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. హిందువుల మత మార్పిడిని అడ్డుకోవాలన్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు నడిచిన ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, కోటేశ్వరరావు, స్వామీజీలు రామాంజనేయ స్వామి, ఆత్మానంద స్వామి, సుబ్బిస్వామి, మందిర అర్చక కన్వీనర్ శివశంకర్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్రసంఘటనా కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కార్యదర్శి భాను ప్రకాష్, నగర అధ్యక్షులు మద్దిలేటి, కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రబలిన అతిసారం

- ఆంజనేయనగర్, బీరవోలు, పగిడ్యాలలో 30కి పైగా కేసులు



రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

పగిడ్యాల: మండలంలోని బీరవోలు, ఆంజనేయనగర్, పగిడ్యాల గ్రామాల్లో అతిసారం ప్రబలింది. బుధవారం రాత్రి ఒకేసారి 30కు పైగా మంది వాంతులు, విరేచనాల బారినపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పలువురు చికిత్స నిమిత్తం పగిడ్యాల పీహెచ్‌సీకి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న నంద్యాల జిల్లా డీఎంహెచ్‌ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి కూడా డాక్టర్లను అందుబాటులో ఉంచుకోవాలని స్థానిక వైద్యాధికారి మోహన్‌కు ఆదేశించారు. అతిసార బాధితుల్లో కొందరిని మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. బీరవోలు నుంచి కేసులు అధికంగా వస్తుండటంతో తమకు ముందుగానే ఎందుకు సమాచారం ఇవ్వలేదని అక్కడి ఆశావర్కర్, ఏఎన్‌ఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆ గ్రామాన్ని సందర్శించి మంచినీటి సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను, పరిసరాలను పరిశీలించారు. మంచినీటిని కాచి వడగట్టి తాగాలని గ్రామస్తులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విమల, వైద్యాధికారి మోహన్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ ఉన్నారు.

ఎంసీఏకు యమ క్రేజీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లో మొత్తం 68 కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు నిర్వహించడానికి ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. ఈ ఏడాది ఎంబీఏ మొత్తం 9,912 సీట్లు, ఎంసీఏ 5,640 సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి లభించింది. గతేడాది ఎంసీఏ సీట్లు 2,790 మాత్రమే కేటాయించగా, తాజాగా 5,640 సీట్లు కావాలని కోరారు. ఈ మేరకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకోగా, ఇందుకు జేఎన్‌టీయూ అనంతపురం ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో ఎంసీఏ కోర్సుకు ప్రాధాన్యత ఏర్పడింది.

- 2023–24 విద్యా సంవత్సరానికి 5,640 సీట్ల భర్తీకి పచ్చజెండా

ఐసెట్ కౌన్సెలింగ్ షురూ

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తరువాత అత్యంత ప్రాధాన్యం ఉన్న ఐసెట్–2023 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఏపీ ఐసెట్‌ను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పకడ్బందీగా నిర్వహించి ఫలితాలను విడుదల చేసింది. గురువారం కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

- ఈ నెల 8 నుంచి 14 వరకు వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్.
- 9 నుంచి 16వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన.
- 12న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన.
- 19 నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు.
- 22న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం.



శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానము

యస్.కొత్తూరు గ్రామము, పాణ్యం మండలం, నంద్యాల జిల్లా.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు టెండర్-కం-బహిరంగ వేలము

పై దేవస్థానము నందు భక్తులు సమర్పించెడి తలనీలాలు, ప్రోగుచేసుకొనెడి హక్కు 1 సంవత్సరము కాలమునకు అనగా తేది: 15-09-2023 నుండి 14-09-2024 వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు టెండర్-కం-బహిరంగ వేలము తేది: 13-09-2023 న ఉ॥ 12.00 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షమున కార్యనిర్వహణాధికారి కార్యాలయం నందు నిర్వహించబడును.

ఇ-ప్రొక్యూర్‌మెంటు నందు పాల్గొనదలచిన వారు

1. టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు ప్రారంభపు తేది : 06-09-2023 మ॥ 2-15 గం॥
2. టెండర్ షెడ్యూల్ సమర్పించు సమయం తేది: 13-09-2023 ఉ॥ 11-00 గం॥
3. టెండర్ షెడ్యూల్ తెరచు తేది సమయం : 13-09-2023 ఉ॥ 11-30 గం॥

గమనిక: ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో పాల్గొనదలచిన వారు ww.apeprocurement.gov.in నందు సంప్రదించగలరు. ఇ-ప్రొక్యూర్‌మెంటు మరియు టెండర్ బాక్స్ తెరచిన వచ్చు హెచ్చుపాటపై అనంతరము 12.00 గంటలకు బహిరంగ వేలము నిర్వహించబడును.

షరతులు: (1) ప్రతి పాటదారుడు వేలమునకు ముందు రూ.2,00,000/- లు ధరావత్తు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానము, ఎస్.కొత్తూరు పేరున డి.డి. గాని నగదు గాని చెల్లించి వేలము పాటలో పాల్గొనవలెను.
(2) వేలము పాట పూర్తి అయిన వెంటనే హెచ్చుపాటదారుడు పాట మొత్తమును వెంటనే చెల్లించవలెను.

వివరములకు: సెల్ : 99892 52908 సంప్రదించగలరు.

శ్రీ స్వామి వారి సేవలో కార్యనిర్వహణాధికారి

బాత్‌రూమ్‌లో కాలు జారి..

- ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆదాం

బనగానపల్లెరూరల్: బాత్‌రూమ్‌లో కాలు జారి కిందపడిన ఘటనలో ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ మృతిచెందాడు. బుధవారం బనగానపల్లెలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ రామిరెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన ఆదాం (47) బనగానపల్లెలోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఇన్‌చార్జ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. పట్టణంలోని కంకర గుర్రెడ్డి కాంప్లెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకుని విధులు నిర్వహిస్తున్న ఆయన బుధవారం బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడ కాలు జారి కిందపడడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బనగానపల్లె ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుమారు 11 సంవత్సరాల నుంచి బనగానపల్లెలో విధులు నిర్వహిస్తున్న మృతుడికి భార్య శ్రావణి, కుమారులు భరత్, శరత్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినాయక చవితి చందా కోసం వెళ్లి..

- ట్రాక్టర్ కింద పడి విద్యార్థి దుర్మరణం
- చింతలాయిపల్లె రోడ్డులో ఘటన



ఆదిత్య(ఫైల్)

కొలిమిగుండ్ల: వినాయక చవితి పండుగ చందా వసూళ్లకు తోటి పిల్లలతో కలిసి వెళ్లిన ఓ విద్యార్థి ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. బుధవారం చింతలాయిపల్లె రోడ్డులో జరిగిన విషాద ఘటన బాధిత కుటుంబంలో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే...అంకిరెడ్డి పల్లెకు చెందిన చిన్న కంబయ్య కుటుంబం చింతలాయిపల్లె రోడ్డులో నివాసం ఉంటుంది. కుమారుడు ఆదిత్య(14) తుమ్మలపెంట క్రాస్ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు కృష్ణాష్టమి సెలవు కావడంతో తోటి పిల్లలతో కలిసి బుధవారం వినాయక చవితి పండుగ చందా కోసం చింతలాయిపల్లె రోడ్డులోని నాపరాతి గనుల వద్దకు వెళ్లారు. అక్కడ రాక పోకలు సాగించే వాహనదారులతో చందాలు వసూలు చేసుకున్నారు. తిరుగుముఖంలో పిల్లలతో కలిసి ట్రాక్టర్‌లో ఇంటికి బయలు దేరాడు. ఇంజన్, ట్రాలీకి మధ్యలో నిలబడిన ఆదిత్య కిందకు దిగే సమయంలో అదుపుతప్పి కింద పడ్డాడు. వెంటనే టైర్లు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. చందా కోసం సరదాగా పిల్లలతో కలిసి వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

HOME TUITIONS

■ Woman Tutors for Home Tution to Teach 6th Class, 1st Year Inter JEE Advanced Maths, Physics, Chemistry at A.Camp, Kurnool. Cell: 99669 57802 [L-780953]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1927]

REAL ESTATE

PLOT FOR SALE

■ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వెనుక శకునాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గరలో సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) సెంటు 1.10 లక్షలు. ప్లాటు కేవలం 3.00 లక్షలు మాత్రమే. నితిక డెవలపర్స్, 98884 24222 ఏజెంట్లు కావలెను. [L-798779]

SERVICES

FURNITURE

■ శ్రీ గౌతమ్ మార్కెటింగ్‌లో HDB బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఫర్నీచర్ సోఫాలు, డైనింగ్ టేబుల్స్ మొ॥, బెడ్స్‌పై 30% డిస్కౌంట్ & లక్కీ హోం డెకార్స్, బెడ్‌షీట్స్, పిల్లో, ఫ్రిజ్ & జిప్ కవర్స్, విండో కర్టన్స్ లభించును. Opp: కాంగ్రెస్ ఆఫీస్, కర్నూలు. 94402 92440 [L-780955]

OLD AGE HOME

■ SERUDS- ఉచిత వృద్ధుల పిల్లల ఆశ్రమంలో పుట్టిన రోజు, పెళ్లి రోజు, పెద్దల పేర్ల మీద భోజన కార్యక్రమాలు జరుపుకొనవచ్చు. SERUDS వృద్ధుల ఆశ్రమం, బి.తాండ్రపాడు, కర్నూలు. 98499 77577 [L-780952]

BUSINESS OFFER

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221536]

■ మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము Ph: 9092692403 [HA-160]

WANTED

■ NGO లో పని చేయుటకు ఇంటర్ చదివిన అభ్యర్థులు కావలెను. జీతము నెలకు రూ॥ 10,000/- అడ్రస్: సెరుడ్స్, కెనరాబ్యాంక్ ప్రక్కన, బుధవారపేట, కర్నూలు. సెల్: 98499 77577 [L-780954]

■ J.M.కంప్యూటర్‌లో వర్క్ చేయుటకు 3to5 సం॥లు Exp.అకౌంటెంట్(Tally) కావలెను. Qly:B.Tech.#1 అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్, Opp:Krazy Boyz, కర్నూలు. 98490 41008 [L-780951]

■ కర్నూలు నగరంలోని మా పెట్రోల్ బంక్ నందు పని చేయుటకు పంపు బాయ్స్ కావలెను. 8 గంటల డ్యూటీ 9,500 జీతం వివరాల కొరకు సంప్రదించండి: 72879 17477, 91829 64173 [L-798777]

■ SSC/INTER/ డిగ్రీ, ITI, డిప్లొమా (P/F) అయి ఖాళీగా ఉన్న 39 స్త్రీ/పులు కావలెను. జీ:13వేలు+DA 6వేలు+ బోనస్+ఫ్రీరూం, opp:శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు.8074816824 [L-787348]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-569]

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లోపెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 9391753308. [HA-576]

■ అనుభవజ్ఞులైన వాల్ పెయింటర్‌లు, చిత్రకారులు మరియు సూపర్‌వైజర్‌లు కావలెను ఒక టీమ్‌తో బిల్డింగ్ ముందు భాగమును వాల్ పెయింటింగ్ చేసి వాటిపై లోగోలను వేయటానికి జిల్లాల వారీగా అనుభవజ్ఞులైన వాల్ పెయింటర్ లు మరియు ఆర్టిస్టులు కావలెను (వ్యక్తులుగా లేదా గ్రూపులుగా). ఈ పనిని పర్యవేక్షించడానికి సూపర్ వైజర్‌లు కావలెను. ఆసక్తి కలవారు ఈ నెంబరులో వెంటనే సంప్రదించండి. Ph: 9652456789 [HA-232]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



నాణ్యతా పరీక్ష అ'ధర'హో!

- మార్కెట్ యార్డుల్లో టెస్టింగ్ ల్యాబ్‌లు
- రైతులకు మంచి ధరలు
- తగ్గిపోయిన మోసాలు



ఎమ్మిగనూరు మార్కెట్‌లో విక్రయానికి తెచ్చిన వేరుశనగ

ఎమ్మిగనూరు: విత్తు నుంచి విక్రయం వరకు అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ కోవలోనే మార్కెట్‌యార్డుల్లో నాణ్యతా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో నాణ్యమైన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటిలో నూనెగింజల ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగే ఎమ్మిగనూరు, కర్నూలు, ఆదోని మార్కెట్ యార్డుల్లో మూడేళ్ల నుంచి టెస్టింగ్ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి.

రైతుకు ఎంతో ప్రయోజనం

జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో ఈ–నామ్ ద్వారా వ్యాపారాలు జరుగుతున్నాయి. పత్తి మినహా వేరుశనగ, మొక్కజొన్న, ఆముదాలు, శనగలు, పొద్దుతిరుగుడు పూల విత్తనాలను నాణ్యతను పరీక్షిస్తున్నారు. ప్రతి ల్యాబ్‌లో నాణ్యత పరీక్షకోసం ఒకరు, నాణ్యత విశ్లేషణ కోసం మరొకరిని ఏర్పాటు చేశారు. మార్కెట్ స్థాయిని , పంట ఉత్పత్తుల రాకను బట్టి సిబ్బంది నియామకం పెంచుకొనే వెసలుబాటు ఉంది. రైతులు అమ్మకానికి తెచ్చిన దిగుబడులను రాశులుగా పోసి టెండర్ పిలుస్తారు. రైతులకు కేటాయించిన నంబర్‌ల ఆధారంగా పంట ఉత్పత్తి శాంపిల్‌ను టెస్టింగ్ ల్యాబ్‌కు పంపుతారు. ఆన్‌లైన్‌లో రైతుకు కేటాయించిన నంబర్‌లో గ్రేడ్‌ల వివరాలు పొందుపరుస్తారు. వ్యాపారులు ఈనామ్ ద్వారా నూనెశాతం, నాణ్యతను బట్టి క్వింటాల్ ధరను కోట్ చేస్తారు. ఎక్కువ ధర కోట్ చేసిన వ్యాపారులు, ట్రేడింగ్ సంస్థకు సరుకును విక్రయించే అవకాశం రైతుకు దొరుకుతుంది.

'మద్దతు'కు మించి ధరలు

ఆదోని, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు డివిజన్‌లలో వేరుశనగ సాగు మరింత పెరిగింది. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 78,736 హెక్టార్లు కాగడా.. ప్రస్తుతం ఖరీఫ్‌లో 63,972 హెక్టార్లలో పంట సాగైంది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రైతులు, వ్యాపారుల మధ్య వేళ్లానుకుపోయిన దళారి వ్యవస్థ క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఫలితంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. వేరుశనగ క్వింటా మద్దతు ధర రూ.5,850 కాగా.. గత రెండేళ్లుగా అంతకు మించి ధర లభిస్తోంది. ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో క్వింటా గరిష్ఠంగా రూ.8210కు అమ్ముడుపోయింది. మద్దతు ధర కంటే తక్కువ ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే పంటను కొనుగోలు చేస్తుంది. అయితే ఆ అవసరం లేకుండా వేరుశనగ రైతులకు మార్కెట్లోనే మంచి ధర లభిస్తోంది.

మెరుగైన సేవలు

పంట ఉత్పత్తులతో మార్కెట్‌కు వచ్చే రైతులకు మెరుగైన సేవలందించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుతో పంట నాణ్యతను బట్టి రేట్లు దక్కుతున్నాయి. రైతులకు జరిగే మోసాలు చాలా వరకు తగ్గాయి. – మాధవ కృష్ణారెడ్డి, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు కార్యదర్శి

మంచి ధర వచ్చింది



ఎమ్మిగనూరు మార్కెట్‌కు 26 సంచుల వేరుశనగను తెస్తే శాంపిల్ తీసుకుని ల్యాబ్‌లో టెస్టు చేసి 'ఏ' గ్రేడ్ ఇచ్చారు. క్వింటా రూ.7,021. 99కు అమ్ముడు పోయింది. గతంలో చేతితో వేరుశనగను నులిమి (పరీక్షించి) వారికి ఇష్టమొచ్చిన రేట్లు రాస్తూ రైతులను మోసం చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. – మహబూబ్‌బాషా, మారందొడ్డి, సి.బెళగల్ మండలం

నాణ్యత నిర్ధారణ ఇలా..

నాణ్యతను తెలుసుకుని రైతులు తెచ్చిన పంటలకు ఏ,బీ,సీలుగా గ్రేడింగ్ ఇస్తారు. నూనెగింజల దిగుబడుల్లో నూనె, తేమశాతం, అవుటన్(బరువు) లెక్కించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నాణ్యతను చూసి వ్యాపారులు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. టెస్టింగ్ ల్యాబ్‌లో 'ఏ' గ్రేడు నమోదైన పంట ఉత్పత్తులకు వ్యాపారులు తక్కువ రేటు నిర్ణయిస్తే అధికారులు రంగప్రవేశం చేస్తారు. నాణ్యతను బట్టి రేటు వచ్చేలా చేస్తారు. గతంలో రైతులు మార్కెట్‌కు తెచ్చిన పంట ఉత్పత్తులను చేతితో పరీక్షించి వ్యాపారులు టెండర్ ఫాంలో ధరలను కోట్ చేసేవారు. దీంతో మోసాలు జరిగేవి. నేడు అలా కాకుండా నాణ్యతను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. మోసాలకు తావివ్వకుండా రైతుల ప్రయోజనాలను ఆశించి రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది.



ల్యాబ్‌లో నాణ్యత పరీక్షల దృశ్యం

క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠ అనంతరం నాగ ప్రతిమలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక పాత బస్టాండు సమీపంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం నాగ ప్రతిమల ప్రతిష్ఠోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాస శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశ స్థాపన, క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, మహాసహస్రాభిషేకంతో పాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో కుంకుమార్చన జరిపించి, హారతినిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేస్తాం



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న ఉర్దూ టీచర్స్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఉర్దూ డీఐ పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. బుధవారం నంద్యాలలో రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశా రు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలకు ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూ ల్స్, ఉర్దూ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పోస్టులను త్వరలోనే భర్తీ చేయడానికి ప్రభు త్వం సుముఖంగా ఉందన్నారు. అర్హత గల ఔత్సాహిక ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా అధికారులను వెంటనే సంప్రదించాలన్నారు. అలాగే పదవ తరగతి ఉర్దూ మీడియం మెటీరియల్ కూడా ఈ సంవత్సరం అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు జమాన్, ప్రధాన కార్యదర్శి దస్తగిరిబాషా, నాయకులు మహబూబ్‌బాషా, ఫయాజ్ హలీ, కలీముల్లా, అనీఫ్, జానీబాషా, మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్):ఈనెల 8వ తేదీన తిరుపతి నగరంలో జరిగే సీపీఐ రాష్ట్ర సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, ధనుంజయుడు, అప్పుపోగు సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో రాష్ట్రంలో 26 జిల్లాలు పర్యటించి 8న జరిగే సభను సీపీఐ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ అంబానీ, ఆదానీలకు అప్పగించడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. సుంకయ్య, మోటా రాముడు, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ: వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు రమేష్‌చంద్ర బాలాజీ, శివలింగమ్మ, రాబర్ట్‌కెనడీ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు సోకిన వెంటనే నిర్లక్ష్యం వహించకుండా ప్రాథమికఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందాలన్నారు.

గోస్పాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండేలా చూడాలని తెలిపారు. కాచి వడబోసిన నీటినే తాగాలని చెప్పారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ జయలక్ష్మి

రుద్రవరం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. బుధవారం తిప్పారెడ్డిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు,పాలు వంటి వాటిని నిత్యం తీసుకుంటే చిన్నారుల్లో రక్తహీనత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ నిరీక్షణ, ఏఎన్‌ఎం రాములమ్మ, ఆశా కార్యకర్త శ్రీదేవి పాల్గొన్నారు.



రూపనగుడి సమీపంలో మడిలో ట్రాక్టర్‌తో దమ్ము కొడుతున్న దృశ్యం



మాయలూరు సమీపంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

ఊపందుకున్న వరి నాట్లు

ఉయ్యాలవాడ : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుందూ నది పూర్తిస్థాయిలో ప్రవహించింది. ఉయ్యాలవాడ, హరివరం, బోడెమ్మనూరు గ్రామాల సమీపంలోనున్న వంతెనలకు సమాంతరంగా ప్రమాదకరస్థాయిలో ప్రవహించింది. దీంతో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు మునిగిపోయాయి. అయితే బుధవారం నదిలో ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో మోటార్లు బయటపడటంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. తాత్కాలికంగా వాయిదా పడిన వ్యవసాయ పనులు మళ్లీ ఊపందుకున్నాయి. కుందూ పరివాహక గ్రామాలైన మాయలూరు, రూపనగుడి, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నెలో ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది కుందూ వెంట 1,200 హెక్టార్లలో వరి సాగయ్యే అవకాశముందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.



రూపనగుడి, ఉయ్యాలవాడ గ్రామాల మధ్య కుందూనదిలో నీటి ప్రవాహం

755 గృహాలు పూర్తి

శిరివెళ్ల: మండలంలో 755 పక్కా గృహాలు పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ నాగశేఖర్ బుధవారం తెలిపారు. మండలానికి మొదటి విడతలో జగనన్న కాలనీలు, సొంత స్థలాలు ఉన్న వారికి 2,387 గృహాలు మంజూరయ్యాయన్నారు. అందులో ఇప్పటి వరకు 755 ఇళ్లు పూర్తి కాగా..మరో 363 గృహాల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. గృహాలన్నీ ఈఏడాది డిసెంబర్ చివరి నాటికల్లా పూర్తి కావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని వివరించారు.

బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారుల నుంచి బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞాన సూర్యుడు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వినియోగదారులకు బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించి త్వరితగతిన చెల్లించేలా చూడాలన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని, మీటరు లేకుండా విద్యుత్ వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.

18 నెలల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స



అప్రామిన్నాకు అందించిన చికిత్స గురించి వివరిస్తున్న వైద్యులు

నంద్యాలటౌన్: ఆరోగ్యశ్రీ ద్వారా 18 నెలల చిన్నారికి అనుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు శాంతిరామ్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. హాస్పిటల్ ఈఎన్‌టీ విభాగం డాక్టర్ రవి బాబు బుధవారం మాట్లాడుతూ బేతంచర్లలో పాలిష్‌కట్టర్‌గా జీవనం సాగిస్తున్న సమీర్, జరీఫా కుమార్తె అప్రామిన్నా పుట్టు మూగ, చెవుడు కావడంతో ఆడియోథెరపీ చికిత్స ద్వారా బాలిక మళ్లీ వినడం, మాట్లాడటం సాధ్యపడుతుందని నిర్ధారించామన్నారు. బాలిక వయస్సు 4 ఏళ్లు దాటితే ఆపరేషన్ చేసినా ప్రయోజనం ఉండదని భావించి వెంటనే ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల ఖర్చు అయ్యే ఆడియోథెరపీ శస్త్ర చికిత్సను ఉచితంగా చేశామని చెప్పారు. ఆపరేషన్ విజయవంతమైందని బాలిక ఇపుడు వినగలుగుతుందన్నారు. భవిష్యత్‌లో పాప మరొకరి సాయం లేకుండా సాధారణ జీవితం గడపవచ్చన్నారు. ఆపరేషన్‌కు ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్లు మధుసూధన్‌రావు, మణిదీప్, రోహిత్, శ్వేత, సౌమ్య,నిర్మల సహకరించారన్నారు. చిన్నారి తండ్రి మాట్లాడుతూ శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఇంత ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.



శకటపు నీడే పాకశాల..

లారీ కింద రొట్టెలు చేసుకుంటున్న లారీ డ్రైవర్, సహాయకుడు

నంద్యాల(సెంట్రల్): రోజుల తరబడి ఇంటికి, ఇంటి భోజనానికి దూరంగా ఉంటారు వాహనాల చోదకులు, సహాయకులు. తమ విధి నిర్వహణలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అయినా వారు హోటళ్లలో భోజనం చేయరు. అనుకూల ప్రదేశాన్ని చూసుకొని వాహనాన్ని ఆపి తామే వండుకొని తింటారు. ఆ తరువాత మళ్లీ యథావిధిగా వాహనాన్ని ముందుకు కదిలిస్తారు. బుధవారం గడివేముల మండల కేంద్రానికి సమీపంలోని జేఎస్‌డబ్ల్యూ పరిశ్రమకు సిమెంట్ లోడ్ కోసం వచ్చిన రాజస్థాన్ వాసులు మధ్యాహ్న సమయం కావటంతో పరిశ్రమ సమీపంలోని బాలాజీ ఆలయం వద్ద తమ ట్రక్కును ఆపుకుని ఇలా వంటకు ఉపక్రమించారు. రాజస్థాన్‌కు చెందిన మహ్మద్ ఆరిఫ్ అనే చోదకుడు తనకు సహాయకుడిగా వచ్చిన రఫీతో కలిసి వంట సామగ్రితో సహా ట్రక్కు కింద వంట చేసుకున్నారు. వారు మాట్లాడుతూ..రాజస్థాన్ నుంచి 10 రోజుల క్రితం బయల్దేరి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ జిందాల్ పరిశ్రమలో సిమెంట్ తీసుకెళ్లడానికి వచ్చినట్లు తెలిపారు. తాము ఎంత దూరం ప్రయాణించినా, హోటల్ భోజనం తినమని, సరకులు కొనుక్కొని స్వయంగా వండుకు తింటామని చెప్పారు. ఈప్రాంత వాసులు చాలా మంచివారని, రూటు తెలియకపోతే సహాయం చేస్తూ సహకరిస్తారన్నారు.

మాతా శిశు మరణాలు చోటు చేసుకోరాదు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: మాతా శిశు మరణాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణుల ప్రసవ ప్రణాళికను రూపొందించి వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యేలా చూడాలని చెప్పారు. అలాగే శిశులకు వ్యాక్సిన్‌లు సకాలంలో వేసి వివరాలు నమోదు చేయాలన్నారు. ఆశా, ఏఎన్‌ఎంలకు కేటాయించిన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, 5 ఏండ్ల లోపు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలని సూచించారు. పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, కుటుంబ వైద్య విధాన నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్ చంద్ర, డాక్టర్లు శ్రీమంత్, కాంతారావు, ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం





ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ నాయకులు, శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలో 20 మంది ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలు, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజాంబేగ్, మౌలాలి, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అంకిత భావంతో విశేషంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే కార్యక్రమం చేపట్టామన్నారు. గోపాలకృష్ణ, ఇక్బాల్, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రోటరీ పాఠశాల ఆవరణలో జిల్లా ఉత్తమ తెలుగు భాషా పండితుడు అన్నెం శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. గ్రీన్‌సొసైటీ గౌరవాధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్ మాట్లాడుతూ అన్నెం శ్రీనివాసరెడ్డి వివిధ రంగాల్లో అనేక రకాల సేవలు అందిస్తున్నారని కొనియాడారు. దండె వెంకటేష్, మహానంది మండల ఎంఈఓ రామసుబ్బయ్య, శ్రీనివాసులు, శేషఫణి, మహబూబ్‌బాషా, నీలం వెంకటేశ్వర్లు, రఫీ, నారాయణ, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఏపీ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ



మల్లన్న దర్శనార్థం వస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.



శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



గోస్పాడులో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



దొర్నిపాడులో చిన్నారుల సందడి

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



చిత్తలూరి వీధిలోని కృష్ణ భజన మందిరంలో ప్రత్యేక అలంకారంలో శ్రీకృష్ణ భగవానుడు



శ్రీ కృష్ణుని ఊయల ఊపుతున్న చిన్నారులు

నంద్యాల(వ్యవసాయం/న్యూటౌన్): పట్టణంలోని చిత్తలూరి వీధిలో వెలసిన శ్రీకృష్ణ భజనమందిరంలో బుధవారం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుడు సుధీంద్రాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ జరిపించి, వివిధ పూలతో అలంకరించారు. అనంతరం సామూహిక తులసీ అర్చన చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ, భక్తులతో ఉట్టికొట్టే కార్యక్రమం ఎంతగానో అలరించింది. అలాగే.. పట్టణంలోని బాలా అకాడమీ రవీంద్ర హైస్కూల్‌లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, బలరాముడు, గోపికల వేషధారణలతో అలంరించారు.

గోస్పాడులో..

మండల కేంద్రమైన గోస్పాడులో శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ఊంజల్‌సేవ, ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

ఆళ్లగడ్డ: అల్లరి కృష్ణుడి పుట్టిన రోజు వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక భారతీవిద్యామందిర్‌లో పాఠశాలలో విద్యార్థులకు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలు వేయించి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శిరివెళ్ల: మండలంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యర్రగుంట్లలోని గీతామందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. విమల పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీకృష్ణుడి పాటలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని ఊయలను భక్తులు, యువతులు ఊపి భక్తి భావం చాటుకున్నారు.



ఆళ్లగడ్డలో ఉట్టి కొడుతున్న చిన్నారి

చాగలమర్రి: ఇతిహాసాల ప్రకారం శ్రీమహావిష్ణువు ఎనిమిదవ అవతారమే శ్రీకృష్ణ భగవానుడని, ఆయన జన్మ దినాన్ని కృష్ణజన్మాష్టమి అని కృష్ణాష్టమి అని గోకులాష్టమి అని పిలుస్తారని ఆశ్రమ ఆచార్యులు శ్రీఅభినవ శంకరానంద స్వామి తెలిపారు. బుధవారం ఆయన శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతం, భగవద్గీత, చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు.

దొర్నిపాడు: మండలంలో జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నికృష్ణుడు, గోపికలుగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు.

8న వ్యూహలక్ష్మీ హోమం

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన వ్యూహలక్ష్మీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బల్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి 4 శుక్రవారాలు శ్రీచక్ర యంత్రంతో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మాసంలో నాలుగో శుక్రవారం రోజైన 8వ తేదీన అత్యంత శక్తివంతమైన వ్యూహలక్ష్మీ దేవి అర్చన అభిషేకం, హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ హోమంలో పచ్చ కర్పూరం, శ్రీగంధం, శ్రీఫలాలు, 108 తామర గింజలు, కలువ పూలు, 108 గంధం చెక్కలు, అష్ట ద్రవ్యాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే వారు రూ.2516 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రీ సర్వేను విజయవంతం చేయండి

ఆత్మకూరు: భూ రీ–సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని కరివేన, వడ్లరామాపురం గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూ రీ సర్వేకు సంబంధించి రైతులతో చర్చించి ఎలాంటి విభేదాలు లేకుండా సర్వే కొనసాగించాలన్నారు. రైతులు సర్వేకు సంబంధించి ఏమైనా సమస్యలు తీసుకువస్తే తమ దృష్టికి తేవాలన్నారు. అధికారులు సక్రమంగా సర్వేలు నిర్వహించి, ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



కరివేనలో భూ రీ సర్వేను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్

మహానందీశ్వరుడి సన్నిధిలో వెండి తులాభారం

మహానంది: ఆళ్లగడ్డ నియోజకవర్గం చింతకుంట్ల గ్రామానికి చెందిన ఇంజేటి నాగిరెడ్డి, సిరిచందన దంపతులు తమ కుమారుడు తాత్విక్‌దేవ్ పుట్టినరోజు పురస్కరించుకుని బుధవారం మహానందీశ్వరుడి సన్నిధిలో వెండి తులాభారం నిర్వహించారు. తమ కుమారుడిని త్రాసులో కూర్చోబెట్టి బరువుకు సరిపడా 11కిలోల వెండిని సమర్పించారు. తులాభారం త్రాసును విరాళంగా ఇచ్చిన దాతలే తొలి తులాభారం మొక్కును చెల్లించుకున్నారు.

మదర్‌థెరిస్సా సేవలు ఎనలేనివి



థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేస్తున్న క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): మదర్‌థెరిస్సా సేవలు ఎనలేనివని వక్తలు పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ చారిటీ దినోత్సవం (మదర్‌థెరిస్సా వర్ధంతి) పురస్కరించుకొని బుధవారం కార్యాలయంలో మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ సీనియర్ సభ్యుడు రవిప్రకాష్, దివ్యాంగుల సంక్షేమ సంఘానికి రూ.8వేలు విరాళంగా అందజేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, లయన్స్‌క్లబ్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, జోన్ చైర్మన్ చంద్రమోహన్, రమణయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్):ఈనెల 7,8 తేదీల్లో గుంటూరులో జరిగే ఆర్ఎస్‌యూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ కోరారు. బుధవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యను కాపాడుకుందాం.. దేశాన్ని రక్షించుకుందాం అనే సదస్సుకు విద్యార్థులు రావాలని పిలుపునిచ్చారు.

